క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

కొమరోలు: గిద్దలూరు శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేశ్వర్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటారని, ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

జగనన్నకు చెబుదాంపై సమీక్ష


మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ మాధురి

కొనకనమిట్ల: సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపేందుకు చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో పాల్గొన్న స్పెషల్ అధికారి మాధురి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి 1902కి కాల్ చేయాలన్నారు. సమస్యలపై ఫిర్యాదు చేసిన తరువాత యువర్ సర్వీస్ ఐడీ ఇస్తారని అన్నారు. ఐడీ ఆధారంగా సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, ఎంపీడీఓ జనార్ధన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవాలతోనే ఆరోగ్యం

గిద్దలూరు రూరల్: సురక్షిత ప్రసవాలతోనే ఆరోగ్యం ఉంటుందని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. మండలంలోని కె.ఎస్.పల్లె పీహెచ్‌సీలో మంగళవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో అనేక రకాల మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్, విలేజ్, అర్బన్ హెల్త్ క్లీనిక్, ఆరోగ్యశ్రీ, 104, 108 వంటి అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సుమయా ఆధ్వర్యంలో 65 మందికి వైద్య సేవలు అందించడమే కాకుండా మందులు అందజేశారు. జెడ్పీటీసీ బుడతా మధుసూదన్‌రావు, డాక్టర్ నాయబ్ రసూల్, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, యూడీసీ నరేష్, ఎంపీహెచ్ఎస్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

'విజిలెన్స్' కోసం దరఖాస్తు చేసుకోవాలి

మార్కాపురం టౌన్: డివిజినల్ విజిలెన్స్, మానిటరీ కమిటీలో సభ్యులుగా కొనసాగేందుకు అర్హత కలిగిన వారు ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి అరుణ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్లుగా ఉపాధిని నిషేధించేందుకు డివిజన్ స్థాయిలో ఏర్పాటు కాబోతున్న కమిటీలు ఇద్దరూ సభ్యులు కొనసాగేందుకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మాన్యువల్ స్కావెంజర్, వృత్తి నిషేధం, పునరావాసం కోసం కృషి చేసిన స్వచ్ఛంద సంస్థకు చెందిన వారై ఉండాలన్నారు. వీరిలో ఒక పురుషుడు ఒక మహిళ సభ్యులుగా ఉంటారని తెలిపారు. అర్హత కలిగిన వారు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోపు మార్కాపురంలోని సహాయ సాంఘిక శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తర్లుపాడు: మండలంలోని పత్తేపురం గ్రామానికి చెందిన తిరుమల వెంకటయ్య (32) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీ కే సుజాత, స్థానిక సర్పంచ్ తిరుమల బాలసుబ్బమ్మ, వైస్ సర్పంచ్ సీహెచ్ వెంకటేశ్వర్లు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్ బీమా తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేసి మృతుని కుటుంబాన్ని ఓదార్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది శ్రీకాంత్, నాయకులు పెద్ద యోగయ్య, పెద్ద కోటయ్య, కాశిరెడ్డి, మేకల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై విజిలెన్స్ తనిఖీలు

దర్శి: దర్శి రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ విజిలెన్స్ ఈఈ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దర్శి ఈఈ ఎస్‌ఏ కరీం ఆధ్వర్యంలో సిబ్బంది 44 బృందాలుగా ఏర్పడి మండలంలోని అన్ని గ్రామాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఏడుగురికి రూ.14 వేలు, మీటరు ఉండి విద్యుత్ చౌర్యం చేస్తున్న ఆరుగురికి రూ.80 వేలు, అనుమతించిన లోడు కన్నా అదనపు లోడు వాడుతున్న 24 సర్వీసులను గుర్తించి రూ.1,13 లక్షల అపరాధ రుసుం విధించినట్లు ఆయన తెలిపారు. విజిలెన్స్ ఈఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, వినియోగదారులు విద్యుత్ చౌర్యం గురించి తనకు సమాచారం ఇవ్వవచ్చని, తన నంబర్ 83310 19980 కు ఎప్పుడైనా ఫోన్ చేయవచ్చని చెప్పారు.

హామీలన్నీ అమలు చేసిన ఘనత జగన్‌దే

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

తర్లుపాడు: ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మీర్జాపేటలోని పట్టాభి సీతారాముల స్వాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై పాల్గొని మాట్లాడారు. చెప్పినవన్నీ చేశామని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్నప్పుడు తన పై చూపుతున్న అభిమానం, అప్యాయతను ఎన్నటికీ మర్చిపోనన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా సీఎం అమలు చేశారని, దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఏ పథకమైనా అవినీతికి, రాజకీయ సిఫార్సులకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా అందజేస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కూడా మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నను చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మురారి, సొసైటీ అధ్యక్షుడు కే సత్యనారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, వైస్ ఎంపీపీలు పుణ్యవతమ్మ చెన్నకేశవులు, కందుల సుజాత, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, ఎంపీటీసీలు పార్వతి రమేష్‌రెడ్డి, వీ అంకమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు కాశయ్య, శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, తిరుమల బాలసుబ్బమ్మ, రామిరెడ్డి, ఆంజనేయులు, శిఖామణి, రసూల్‌షా జహాన్, నవ్యరమణయ్య, పెద్ద మస్తాన్‌తో పాటుగా పార్టీ నాయకులు వెలుగొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, శేషయ్య, కొండారెడ్డి, దాసయ్య, ఎబినేజర్, పెద్ద మల్లికార్జునరెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

మార్కండేశ్వర స్వామికి లక్ష మల్లెలార్చన


స్వామి వారికి లక్ష మల్లెపూలార్చన


అమ్మవారికి మల్లెపూలార్చన


విగ్రహ ప్రతిష్టకు హాజరైన జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని జగదాంబసమేత మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో వైశాఖమాస మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆదిదంపతులైన శివపార్వతులకు లక్ష మల్లెల అర్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్రనామార్చన, అమ్మవారి శ్రీ చక్ర సహిత కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన, దేవీఖడ్గమాల నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అర్చకులు తేజశర్మ, సాయిశర్మ, రేవంత్ శర్మ, సుబ్బారావు శర్మలు పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వాలిచర్ల కేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారుల్లో ఎస్ఎస్ అగ్రికల్చర్, హార్టీకల్చర్, లా కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, లా కాలేజీ ఫౌండర్ నాదెళ్ళ సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ నాదెళ్ల చంద్రమౌళి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైఎస్ ఆర్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, సాయిబాబా, ఆలయ కమిటీ అధ్యక్షుడు జీ హరిహరరావు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు, వైఎస్ఆర్ సీపీ నాయకులు పంబి వెంకటరెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, రిటైర్డ్ తహశీల్దార్ సుబ్బారావు, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, లెక్చరర్స్ పాల్గొని పూజలు నిర్వహించారు.

12 నుంచి షిరిడీ సాయి ఆలయ చతుర్థ వార్షికోత్సవం

తర్లుపాడు: ఈ నెల 12 నుంచి తర్లుపాడులోని షిరిడీ సాయి మందిర చతుర్థ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ యం నాగమల్లికార్జున్ తెలిపారు. ఇందులో భాగంగా నేడు, రేపు సాయి సచ్చరిత్ర పారాయణం, 12న అభిషేకం , అలంకరణ, చెన్నమల్లేశ్వర స్వామి (బొడిచెర్ల) వారిచే భజన, పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం హారతి, అనంతరం అన్నదానం, సాయంకాలం హారతి అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై బాబా వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ట్రస్ట్ బోర్డు, మహిళా కమిటీ సభ్యులు కోరారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలో వెలసిన రామదూత క్షేత్రంలో 11వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ముందుగా హోమాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రమాసహిత సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఉభయ దాతలుగా దివ్వెల పేరం, బొగ్గరపు, కొప్పరపు, చెక్కా, పాలువాది కుటుంబాలకు చెందిన దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. ఉత్సవాల అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ నెల 14 వరకు సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకటరామకృష్ణ, యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.

భక్తుల కొంగు బంగారం అంకమ్మ తల్లి


ప్రత్యేక అలంకరణలో అంకమ్మ తల్లి

ముండ్లమూరు: మండలంలోని ఈదర అంకమ్మతల్లి తిరునాళ్ల మంగళవారం వైభంగా జరిగింది. ఈదర అంకమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చడంతో భక్తుల కొంగు బంగారంగా పేరుంది. తిరునాళ్ల సందర్భంగా మండలంలోని పలు గ్రామాలతో పాటు పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఊయలు ఊపితే సంతానం లేని వారికి సంతానం కలుగుతుందనే నమ్మకం ఉంది. గతంలో కోరిన కోర్కెలు నెరవేరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్నదానం చేశారు. ఆలయ పూజారి నాగుమల్లి రమణయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యశాఖ వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. తిరునాళ్లకు పూరిమెట్ల, ఈదర, భీమవరం గ్రామాల నుంచి నాలుగు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ప్రభల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శి సీఐ రామకోటయ్య ఆధ్వర్యంలో ఎస్ఐ సంపత్‌కుమార్ పర్యవేక్షణలో 30 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు పంపిణీ


మాట్లాడుతున్న గోపాలరెడ్డి

పొదిలి: స్థానిక వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాలరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు ప్రభుత్వం అందచేస్తున్న పరికరాలు, సబ్సిడీలు, ఇతర రాయితీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మల్లిక, నరసమ్మలకు వీల్‌చైర్లు, తిరుపతయ్య, దుర్గాలక్ష్మి, ఆంజనేయులు, అనిల్‌లకు ట్రైసైకిళ్లను గోపాలరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. పొదిలి మండల విభాగం అధ్యక్షుడు దేవళ్ళ ఆంజనేయులు ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బత్తిని వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా కలిగిన వ్యక్తి అరెస్టు

కంభం: మండలంలోని లింగాపురంలో మద్యం అక్రమంగా కలిగి వ్యక్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు స్థానిక ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామ శివారులో అన్నెం సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మాదిగలను శత్రువులుగా చూస్తున్న బీఎస్పీ

దర్శి: ఎస్సీల వర్గీకరణను వ్యతిరేకిస్తున్న బీఎస్పీ నాయకులను మాదిగ పల్లెల్లో నిలదీయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగ నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం దర్శి నియోజకవర్గంలోని ఏపీటీఎఫ్ భవనంలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా కన్వీనర్ తోరటి ఆనంద్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ ఆదిమూలపు ప్రకాష్‌మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు బొంతా దాస్‌మాదిగ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అభినందన

దర్శి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం దర్శి జోన్ స్థాయి సమావేశం స్థానిక కేజీబీ పాఠశాలలో జోనల్ ఎగ్జిక్యూటివ్ సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ శ్రావణ్‌కుమార్, ఎంఈఓ రఘురామయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లికార్జునావు, దిలీప్ చక్రవర్తి హాజరయ్యారు. సమావేశంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందిన కేజీబీ పాఠశాల విద్యార్థి సాయి అజయ్ జశ్వంత్, మండల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రథమ స్థానం పొందిన పాతకమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అడపాల అమూల్యను సన్మానించి అభినందించారు.

దొనకొండలో..

దొనకొండ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఈ ఏడాది 600 మార్కులకు 560 మార్కులు సాధించిన బి.వరణ్ నందన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు అభినందించారు. మంగళవారం విద్యార్థికి అభినందన సభ ఏర్పాటు చేశారు. తోటి విద్యార్థులు వరుణ్ నందన్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ప్రధానోపాధ్యాయుడు కోరారు. అనంతరం కేకు కట్ చేసి వరుణ్ నందన్‌కు తినిపించారు. పాఠశాల సిబ్బంది, వరుణ్ నందన్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

ముండ్లమూరు: విద్యుత్ సిబ్బందిపై దాడికి పాల్పడ్డ వారిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. భీమవరంలో విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది కూడలి నవీన్, దత్తులపై ఎస్సీ కాలనీకి చెందిన గద్దల దావీదు, అక్కమ్మలు దాడి చేసి రీడింగ్ మీటరు, సెల్‌ఫోన్ ధ్వంసం చేయడంతో పాటు వారిపై దాడి చేసి గాయపరిచారు. నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షకు సన్నద్ధం

మార్కాపురం: మే నెల 10వ తేదీ పాలి సెట్ టెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు సర్వం సిద్ధమైంది. జార్జ్ ఇంజినీరింగ్ కళాశాల కోఆర్డినేటింగ్ సెంటరుగా వ్యవహరిస్తోంది. మార్కాపురంలో మొత్తం మూడు సెంటర్లలో 1386 మంది పరీక్షకు హాజరు కానున్నారు. వీరిలో బాలికలు 371 మంది, బాలురు 1015 మంది ఉన్నారు. స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో 636 మంది, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 350 మంది హాజరవుతున్నారు. ఈ పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షకు కోఆర్డినేటర్‌గా నెల్లూరు పాలిటెక్నిక్ నుంచి పి ప్రభాకర్, జార్జి ఇంజినీరింగ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు, అసిస్టెంట్ కోఆర్డినేటరుగా ఎస్ రాజ గోపాల్‌రెడ్డి, స్పెషల్ అబ్జర్వర్‌గా నియమితులయ్యారు. ఈ పరీక్షకు రిపోర్టింగ్ టైమ్ ఉదయం 10 గంటలు కాగా, 11గంటల నుంచి ఒంటి గంట వరకు జరుగుతుంది. ఈ మేరకు కోఆర్డినేటర్ అధ్యక్షతన చీఫ్‌లకు సమావేశం నిర్వహించారు.

ప్రిన్సిపాల్‌పై నిరాధార ఆరోపణలు తగవు

తాళ్లూరు: స్థానిక వీకే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తారక్‌నాథ్‌పై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దార అంజయ్య నిరాధార ఆరోపణలు తగవని కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అన్నారు. స్థానిక వీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం సమావేశమైన అధ్యాపకులు.. కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ చేస్తున్న కృషిని వివరించారు. నాడు–నేడు పనులు కూడా చక్కగా జరుగుతున్నాయన్నారు. దాతల సహకారంతో కళాశాలలో చేసిన అభివృద్ధి అలాగే ఉందని, ప్రభుత్వం కూడా నాడు–నేడుతో అభివృద్ధి చేయడంతో కళాశాల మరింత అభివృద్ధి చెందటం కొందిరికి ఇష్టం లేక కావాలనే స్వార్థ ప్రయోజనాలతో ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. సమావేశంలో గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ పాండురంగరాజు, సివిక్స్, ఎలక్ట్రానిక్స్ అధ్యాపకులు గురవయ్య, ఎల్ఎల్ నరసింహారావు, అధ్యాపకేతర సిబ్బంది పి.అనిన్ పురోషోత్తం, షేక్ మాలిన్, బి.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, సీహెచ్ జయపాల్‌రావు, సుబ్బరామయ్య పాల్గొన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.దేవేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, గృహహింస కేసులు, భరణం కేసులు, క్రిమినల్ కేసులు వంటివి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సునీతాబ్రహ్మారెడ్డి

ముండ్లమూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కుసుమకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి హామీ పథకానికి సంబంధించి అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామానికి తాగు నీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. ఎస్ఏపీ పథకం ద్వారా నీటి సంరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. బృందావనం, పసుపుగల్లుకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు జరుగుతున్నాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. అక్రమాలను అరికట్టి కూలీలకు మేలు జరిగేలా చూడాలన్నారు. పూరిమెట్లలో హైస్కూల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కోరారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, డీటీ పుల్లారెడ్డి, వైస్ ఎంపీపీలు పద్మావతి జానకిరామయ్య, రమణమ్మ నాగిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారికి అభినందనలు


అవంతికను సన్మానిస్తున్న న్యాయవాదులు

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి భూపతి కాశయ్య కుమార్తె అవంతిక ఇటీవల మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో నిర్వహించిన భరతనాట్య ప్రదర్శనలో మంచి ప్రతిభ కనబరచడంతో మలేషియాలోని భారత రాయబారి సీ సుష్మ చేతుల మీదుగా ప్రశంసపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం మార్కాపురం పట్టణానికి చెందిన పలువురు న్యాయవాదులు అవంతికను ఘనంగా సన్మానించారు. జిల్లా ఆరో అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్ బాలునాయక్, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ గాంధీరెడ్డి మాట్లాడుతూ అవంతిక భవిష్యత్తులో ఇంకా మంచి ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాదులు యం సత్యనారాయణ, వై వెంకటేశ్వరరెడ్డి, అనీల్‌కుమార్, రామకృష్ణ, పురుషోత్తమనాయక్, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఉపసర్పంచ్ గురుబ్రహ్మం తదితరులు శాలువ కప్పి అవంతికను సన్మానించారు.

వీఓఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణ

దొనకొండ: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణ ఏపీఎం జి.వెంకటేశ్వర్లు మంగళవారం ఇచ్చారు. సెంట్రల్ గవర్నమెంట్‌కు సంబంధించి లోకోస్ యాప్‌లో ప్రతి సభ్యురాలు, ప్రతి గ్రూపు, ప్రతి గ్రామ సంఘం సమాచారం ఆన్‌లైన్‌లో పొందు పరచాలని పేర్కొన్నారు. గ్రూపులోని 10 మంది సభ్యుల సమగ్ర సమాచారం తప్పులు లేకుండా ఉన్నది ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. సీసీలు ప్రసన్నకుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: పొదుపు మహిళల డేటాను లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ పి.రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏలకు లోకోస్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. డ్వాక్రా సంఘాల మహిళల లావాదేవీల పూర్తి సమాచారం, వెలుగు పథకంలో మంజూరైన పథకాల వివరాలు నమోదు చేయాలని సూచించారు. యాప్‌లో సభ్యుల సమాచారం నమోదు సమయంలో ఆధార్‌కార్డు, వ్యక్తిగత బ్యాంక్‌ఖాతా, సంఘం లావాదేవీలు సభ్యుల నుంచి తీసుకుని చేయాలని సూచించారు. ఏపీఎం కె. రఘునాథబాబు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు జి.అంజనదేవి, సీసీలు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: కేంద్ర ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల వివరాలు నమోదు చేసేందుకు లోకోస్ యాప్ రూపొందించిందని అందులో భాగంగా యాప్‌పై మంగళవారం స్థానిక వైఎస్సార్‌క్రాంతి పథం కార్యాలయంలో గ్రూపు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం కె.గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామ సంఘం, సభ్యుల వివరాలు అన్నీ కూడా లోకోస్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. యాప్‌పై గ్రామ సంఘం అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తారని చెప్పారు.

మంత్రి సురేష్‌ను కలిసిన దర్శి డీఎస్పీ


మంత్రి సురేష్‌కు పూల మొక్క అందిస్తున్న డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి

మార్కాపురం: రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను మంగళవారం మార్కాపురంలోని జార్జి గెస్ట్‌హౌస్‌లో ఇటీవలే దర్శి డీఎస్పీగా నియమితులైన అశోక్ వర్ధన్‌రెడ్డి కలిసి పూల మొక్క అందించి సన్మానించారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడవద్దని దర్శి సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు సత్వర న్యాయం అందించాలని మంత్రి సురేష్ డీఎస్పీకి సూచించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

మార్కాపురం టౌన్: బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థను కాషాయీకరణ చేస్తోందని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, ప్రాణాలర్పించిన వారి చరిత్రను పాఠ్యపుస్తకాల గురించి కేంద్ర ప్రభుత్వం తీసేయడం మంచిది కాదని ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎంపీజే (మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ రజాక్, పట్టణ కన్వీనర్ షేక్ అమీర్ తదితరులు మంగళవారం సబ్ కలెక్టర్ సేధు మాధవన్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. చరిత్ర నుంచి మొదటి విద్యాశాఖ మంత్రి అబ్దుల్ కలాం ఆజాద్, భగత్‌సింగ్ చరిత్రను తొలగిస్తూ ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హేగ్డేవార్ ప్రసంగాన్ని చేర్చాలనుకోవడం మంచి సాంప్రదాయం కాదన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు గౌస్, మీరావలీ, షఫీ, కాశీంపీరా, మున్నా తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న నిల్వలను పరిశీలించిన మార్క్‌ఫెడ్ డీఎం


మొక్కజొన్న నిల్వలు పరిశీలిస్తున్న మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ

తాళ్లూరు: మొక్కజొన్న నిల్వలను మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ మంగళవారం పరిశీలించారు. శివరామపురంలో రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం మద్దతు ధర కల్పించిందని, ఎవరూ తక్కువ ధరలకు అమ్ముకోవద్దని చెప్పారు. మండలంలో మొక్కజొన్న రైతులకు సంబంధించి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి ప్రసాదరావు డీఎం దృష్టికి తెచ్చారు. గతంలో మొక్కజొన్న బహిరంగ మార్కెట్‌లో రూ.2300 వరకు అమ్మకాలు జరిగాయని, నేడు ధర పతనమైనట్లు రైతులు డీఎం దృష్టికి తెచ్చారు.

ఉద్యోగులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు


నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

మార్కాపురం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ప్రభుత్వ ఉద్యోగులను ఇబ్బంది పెట్టేలా ఉన్నాయని వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్‌ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ గ్రూప్ సీ, పోస్ట్ మ్యాన్ అండ్ ఎంటీఎస్, జీడీఎస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, డివిజన్ సంఘం అధ్యక్షుడు సయ్యద్ సుభాని అన్నారు. మంగళవారం దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా మార్కాపురంలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తపాలాశాఖ ఎన్ఎఫ్‌పీఈ, ఏఐపీఈయూ, గ్రూప్ సీ సంఘాల గుర్తింపు రద్దు చేయడం హేయమైన చర్య అన్నారు. పోస్టల్ యూనియన్ నాయకులపై వేధింపులు మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మణికుమార్, హర్షద్‌ఖాన్, అల్లం రవి, సుకుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.